సాక్షి
సూర్యాపేట
సోమవారం, 27, మే, 2024



యాదాద్రిలో భక్తజన జాతర

యాదాద్రిలో భక్తజన జాతర కొనసాగింది. ఆదివారం కావడంతో భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

- 8లో



మట్టపల్లిలో పుష్పయాగం

మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు.

- 8లో

గరిష్టం / కనిష్టం
41°/ 31°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

పోలింగ్‌కు వేళాయే..

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎమ్మెల్సీ బరిలో 52 మంది అభ్యర్థులు
- ఉదయం 8 గంటల నుంచి పోలింగ్
- వచ్చే నెల 5వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు
- పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి, సిబ్బంది



సూర్యాపేట డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో జంబో బ్యాలెట్ బాక్స్‌ను తీసుకొస్తున్న సిబ్బంది



సూర్యాపేట కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 605 పోలింగ్ కేంద్రాల్లో 4,63,839 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

కేంద్రాలకు చేరిన సామగ్రి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటికే ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా జిల్లాల్లో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్ల నుంచి ఆదివారం పోలింగ్ సామగ్రి, జంబో బ్యాలెట్ బాక్సులతో బస్‌ల్లో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. నల్లగొండ డీఆర్‌సీ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి తరలింపు ప్రక్రియను రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన పర్యవేక్షించారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించేలా ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు శనివారమే సూచనలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున పెద్ద బ్యాలెట్ పేపర్ ముద్రించారు. దానికి అనుగుణంగా జంబో బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తున్నారు. అయితే ఆ బాక్సును తీసుకెళ్లేందుకు ఆర్టీసీ బస్‌ల్లో సీట్లు తొలగించారు.



ఎన్నికల సామగ్రితో బస్సులో వెళ్తున్న సిబ్బంది

జిల్లాల వారీగా ఓటర్లు

జిల్లా	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
సిద్దిపేట	3122	1557	0	4679	5
జనగామ	14915	8503	1	23419	27
హన్మకొండ	25739	17990	0	43729	67
వరంగల్	27038	16774	0	43812	59
మహబూబాబాద్	22948	11985	0	34933	36
ములుగు	6587	3712	0	10299	17
జయశంకర్‌భూపాలపల్లి	8000	4535	0	12535	16
భద్రాద్రికొత్తగూడెం	22590	17516	0	40106	55
ఖమ్మం	50676	33199	4	83879	118
యాదాద్రిభువనగిరి	20838	13242	0	34080	37
సూర్యాపేట	34176	17321	0	51497	71
నల్లగొండ	51560	29311	0	80871	97
మొత్తం	288189	175645	5	463839	605

పోలింగ్ అనంతరం నల్లగొండకే..

పోలింగ్ ముగిసిన తర్వాత మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 12 కొత్త జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులన్నీ నల్లగొండ సమీపంలో దుప్పలపల్లి గోదాములో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచనున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. జూన్ 5వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



సామగ్రిని బస్సుల్లోకి చేరుస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ పోరుకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించాం
- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు



కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే

భానుపురి (సూర్యాపేట): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్.లత, అదనపు ఎస్పీ నాగేశ్వరరావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు పోలింగ్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి అందించామని తెలిపారు. పోలింగ్ సమయంలో 71 కేంద్రాల్లో నిరంతరం వెబ్ కాస్టింగ్, 19 సమస్యాత్మక కేంద్రాల్లో బయట కూడా వెబ్ కాస్టింగ్ చేపట్టామని తెలిపారు. సూర్యాపేట డివిజన్‌లోని 31 కేంద్రాల్లో మహిళా ఓటర్లు 17,081, పురుష ఓటర్లు 9071, కోదాడ డివిజన్‌లోని 22 కేంద్రాల్లో మహిళా ఓటర్లు 8,120, పురుష ఓటర్లు 4,065, హుజూర్‌నగర్ డివిజన్‌లోని 18 కేంద్రాల్లో 8,975, పురుష ఓటర్లు 4,185 మొత్తం 51,497 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 16 మంది తహసీల్దార్లను సెక్టార్ అధికారులతోపాటు 340 మంది సిబ్బందిని కేటాయించామని తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ రూట్ల వారీగా వాహనాల్లో ఎన్నికల సామగ్రితో సిబ్బందిని ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు పంపించామన్నారు. మూడు డివిజన్లలో 22 పోలింగ్ కేంద్రాల్లో 800 మంది ఓటర్లు ఉన్నచోట జంబో పోలింగ్ బాక్సులు, అలాగే మిగతా చోట పెద్ద పోలింగ్ బాక్సులు వినియోగిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధివిధానాలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలని, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, ఎల్‌డీఎం బాపూజీ, తహసీల్దార్లు, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్.లతతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లు, ప్రొసీడింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు జంబో బ్యాలెట్ బాక్సులను ఖాళీగా ఉందని ఏజెంట్లకు చూపించాలని, పోలింగ్ ముగిసిన తర్వాత వారిముందే సీల్ చేయాలన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే పోలింగ్ రోజు సాయంత్రం 4గంటల వరకు 144 సెక్షన్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు

న్యూస్‌రీల్

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలో జూన్ 2, 3వ తేదీల్లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక కోరారు. ఆదివారం సూర్యాపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో గత ప్రభుత్వ కాలంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళలను రాజకీయంగా ఎదగకుండా హిందుత్వ ఎజెండాను తీసుకొచ్చి ప్రతి మహిళా తన భర్త అడుగుజాడల్లో నడవాలని మనువాదాన్ని అమలు చేస్తున్నారని వాపోయారు. మహిళలు రాజకీయంగా చైతన్యవంతులై అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు పొందే విధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకళ, కోశాధికారి రేణుక, ఉపాధ్యక్షురాలు జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మిల్లర్ల అరెస్ట్

తిరుమలగిరి: తిరుమలగిరిలోని సంతోస్ రైస్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఇద్దరు యమానులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మిల్లుకు అప్పగించిన సీఎంఆర్ ధాన్యంలో అవకతవకలకు పాల్పడినట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా మిల్లు యజమానులైన ఇమ్మడి సోమనర్సయ్య, ఇమ్మడి సోమయ్యలను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సూర్యాపేట డీఎస్పీ జి.రవి తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

రాజాపేట: యాదాద్రి భువనగిరి, జనగాం, మేడ్చెల్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు యాదాద్రి జిల్లా రిజినల్ కోఆర్డినేటర్ రజనీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఒకేషనల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఏసీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు కాకులారపు జనార్దన్ స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణు గోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నాగార్జునసాగర్: నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా జట్టును ఆదివారం నందికొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంపిక పోటీలకు 60మంది క్రీడాకారులు హాజరయ్యారని.. వారిలో 12 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీన హైదరాబాద్ దోమలగూడలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారులు సంయుత్ నాయుడు, ధనుష్‌నాయక్ క్రీడా దుస్తులు అందజేశారు.

భక్తులూ ఇది మరవకండి!

యాదాద్రి కొండపై ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్ల నిషేధం

- జూన్ మొదటి వారం నుంచి అమలు
- దుకాణదారులకు ఆదేశాలు జారీ
- ఆలయ విభాగాల్లోనూ నిషేధం
- సీసం, రాగి బాటిళ్ల వినియోగం

యాదగిరిగుట్ట : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను వినియోగించరాదని యాదాద్రి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. ఈ నిబంధన జూన్ మొదటి వారంలో అమల్లోకి రానుంది. ఈ మేరకు ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం పరిధిలోని దుకాణదారులతో పాటు ఆలయ విభాగాలకు కూడా ఈ నిబంధన వర్తించనుంది. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా సీసం, రాగి వంటివి వినియోగించాలని కోరారు.

ఈఓ కార్యాలయం నుంచే శ్రీకారం

ప్లాస్టిక్ నిషేధం అమలుకు తొలుత ఈఓ కార్యాలయం నుంచే శ్రీకారం చుట్టారు. గతంలో తాగడానికి ప్లాస్టిక్ బాటిళ్ల నీటిని వినియోగిస్తుండగా ప్రస్తుతం సీసం, రాగి సీసాలు వాడుతున్నారు. అలాగే కొండపై ఉన్న అడ్మినిస్ట్రేషన్, ఇతర విభాగాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు వాడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రసాదాలు.. ప్లాస్టిక్ కవర్లలోనే

యాదాద్రి ఆలయంలో భక్తులు కొనుగోలు చేసే లడ్డూ, పులిహోర, చిన్న లడ్డూ, దద్దోజనం వంటి ప్రసాదాలను ఇప్పటివరకు ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేసి ఇస్తున్నారు. అభిషేకం లడ్డూ మాత్రం పేపర్‌తో తయారు చేసిన డబ్బాలో ఇస్తున్నారు. ఇక నుంచి వీటిని ప్లాస్టికేతర కవర్లలో ప్యాకింగ్ చేయనున్నారు.

దుకాణదారులు సహకరిస్తారా?

యాదాద్రి కొండపైన, ఆలయ ఆధీనంలో ఉన్న దుకాణాల్లో విపరీతంగా ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్నారు. జూన్1నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలు చేయనున్న నేపథ్యంలో దుకాణదారులు ఏ మేరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా కొండపైన ఉన్న 28 దుకాణాల్లో ప్లాస్టిక్ అంతా అమ్ముకుని, సీసం బాటిళ్లు, ప్లాస్టికేతర కవర్లను వాడాలని అధికారులు సూచనలు చేశారు.

ముందుగా నా కార్యాలయం నుంచే అమలు

తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఆలయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. యాదాద్రిలో తొలుత నా కార్యాలయం నుంచే ప్లాస్టిక్ నిషేధం అమలుకు శ్రీకారం చుట్టాం. ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా కాపర్, స్టీల్ బాటిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నాం. జూన్ 1లోపు దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ వస్తువులను అమ్ముకోవాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. నిషేధం కట్టుదిట్టంగా అమలు చేసేందుకు వాహనాలను కూడా తనిఖీ చేస్తాం. ప్లాసిక్ వాటర్ బాటిళ్లను అనుమతించబోం. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన తరువాతే నిషేధం అమలు చేస్తాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాం.

–భాస్కర్‌రావు, ఈఓ, యాదాద్రి దేవస్థానం



ఈఓ భాస్కర్‌రావు వాడుతున్న కాపర్ బాటిల్స్

అమలయ్యేనా?

యాదాద్రి ఆలయంలో గతంలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టారు. కానీ, వివిధ కారణాల వల్ల వారం రోజులకే నిషేధం మొదటికొచ్చింది. యాదాద్రిని ప్రపంచస్థాయి క్షేత్రంగా తీర్చిదిద్దిన తరువాత భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొబ్బరికాయలు, పూలు, పండ్లు ఇతర వస్తువులు తీసుకెళ్లడానికి పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. అంతేకాకుండా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పెరిగింది. తద్వారా పర్యావరణం కలుషితం అవుతుండడంతో కొండపై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు.

రేపు రామాయణ ప్రతిభా పరీక్ష

భానుపురి(సూర్యాపేట): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో గల శ్రీవిజయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 9గంటలకు రామాయణంపై ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, నాగవెల్లి దశరథ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులందరూ హాజరు కావొచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 9848749022 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం , ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

'కోడ్' ముగిస్తేనే ప్రగతి

- లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో నిలిచిన పనులు
- గ్రామాల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన
- నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే!
- పరిష్కారానికి నోచుకోని ప్రజా సమస్యలు



ఎన్నికల కోడ్ ముగియగానే సొంత భవనానికి నోచుకోనున్న జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రం

భానుపురి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జిల్లావ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల పరిధిలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు ఉండగా.. కలెక్టర్ మొదలు కిందిస్థాయి ఉద్యోగి వరకు ఎన్నికల విధుల్లోనే ఉన్నారు. ఈనెల 13న లోక్‌సభ పోలింగ్ ముగిసింది. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ ఉండడంతో అధికార యంత్రాంగం అదే హడావుడిలో నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు కుంటుపడడంతో పాటు ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయి.

అంచనాల దశలోనే..!

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మార్చి 16న ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. నాటి నుంచి జూన్ 4న ఫలితాలు వెల్లడయ్యే వరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండనుంది. ఈ ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా 40 రోజులకుపైగా ఉండడంతో పాలన కొంత మేర గాడి తప్పినట్లయింది. కొత్తగా చేపట్టే పనులకు ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉండడంతో ప్రజా సమస్యల పరిష్కారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికి తోడుగా ఫలితాల అనంతరం అధికారుల బదిలీలు ఉంటాయనే భావనతో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి యంత్రాంగం అంతగా శ్రద్ధ వహించడం లేదని తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందే ప్రగతి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయించారు. వేసవి నేపథ్యంలో ఇందులో రూ.కోటి నిధులను తాగునీటి ఎద్దడి నివారణకు వెచ్చించాలని మార్చి నెల ప్రారంభంలోనే అధికారులను ఆదేశించారు. మిగిలిన నిధులను ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన పనులకు వినియోగించాల్సి ఉంది. ఇంతలోనే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సంబంధిత పనులు అంచనాల దశలోనే ఉండిపోయాయి.

ప్రజావాణి నిలిపివేత

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని జూన్ వరకు నిలిపివేశారు. దీనిద్వారా వివిధ సమస్యలను ప్రజలు నేరుగా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు విన్నవించే అవకాశం ఉండేది. అయితే ప్రజావాణి నిలిపివేత కారణంగా చాలా సమస్యలు పేరుకుపోయాయి. జూన్‌లోనే సాగు ప్రణాళిక, మౌలిక వసతుల కల్పన, రహదారులు, ప్రజారోగ్యం వంటి కీలక విషయాలపై శాఖాపరమైన సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇలా సమావేశాల్లో గుర్తించిన పనులకు నిధులు కేటాయించాల్సి ఉండగా.. వీటన్నింటికీ లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాతనే మోక్షం కలగనుంది.

స్థానిక సంస్థలకు నిలిచిన నిధులు

జిల్లావ్యాప్తంగా 23 మండలాలు, 475 గ్రామ పంచాయతీలు, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్లతో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో పలు అభివృద్ధి పనులను అధికారులు గుర్తించి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా నిధుల కేటాయింపు నిలిచింది. ఇప్పటికే మొదలైన పనులు కూడా పర్యవేక్షణ లోపంతో నత్తనడకన సాగుతున్నాయి. 475 గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండడంతో పనులు మందగించాయి. పారిశుద్ధ్య పనులు, కాలువలు, రహదారుల నిర్మాణాలకు నిధులు ఇప్పట్లో అందేలా కనిపించడంలేదు. పల్లె నుంచి పట్నం దాకా సమస్యలు పరిష్కారమై.. ప్రగతి పట్టాలెక్కాలంటే లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియాల్సిందేనని ప్రజలు, అధికారులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

వారెవ్వా.. సుతిక్ష

• తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో సుతిక్ష

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని కొండల రాయినిగూడెం గ్రామానికి చెందిన మోర నాగరాజు, స్వాతి దంపతుల కుమార్తె సుతిక్ష తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఏడాది వయస్సున్న సుతిక్ష ఈ నెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పండ్లు, కూరగాయలు, మానవ శరీరభాగాలు, జంతువులు, వాహనాలు, కలర్స్ పేర్లు గుర్తుపట్టడంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతో పాటు వరల్డ్‌వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ సభ్యులు గుర్తించి ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్ అందించారు.

4,200 కేజీల నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని చెన్నారం గేట్ వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా డీసీఎంలో తరలిస్తున్న 4,200 కేజీల నల్లబెల్లం, 360 కేజీల పటికను దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన నల్లబెల్లం, పటిక విలువ సుమారు రూ.7,36,000 ఉంటుందని దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. నల్లబెల్లం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహన తనిఖీల్లో సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎ. నరసింహ, పి. వీరబాబు, కానిస్టేబుళ్లు మర్ల కృష్ణ, బి. కృష్ణ, ఎస్. కృష్ణ పాల్గొన్నారు.

ఛాతీనొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): ఛాతీనొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి రాములు(60) గత కొన్నేళ్లుగా ఛాతీ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఛాతీనొప్పి భరించలేక ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కొంతసేపటి తర్వాత తన భార్య గుర్తించి చుట్టుపక్కల వారి సహాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు కొత్తపల్లి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

సాగర్ వెనుక జలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చందంపేట (నేరేడుగొమ్ము) : నాగార్జునసాగర్ వెనుక జలాల్లో మునిగి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నేరేడుగొమ్ము మండల పరిధిలోని వైజాగ్ కాలనీలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. సుమారు 30 వయస్సు గల వ్యక్తి మృతదేహం సాగర్ వెనుక జలాల్లో తేలియాడుతుండడంతో స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ సతీష్ తన సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి అతడి జేబులో వెతకగా ఏలాంటి ఆధారాలు లభించలేదు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడా అనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పట్టభద్రుల పోలింగ్



సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సులు



భూదాన్‌పోచంపల్లి: జెడ్పీహెచ్ఎస్‌లో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



నల్లగొండ: సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్



నల్లగొండ సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రిని పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

యాదాద్రిలో భక్త జన జాతర

స్వామివారిని దర్శించుకున్న 81వేలకు పైగా భక్తుల రాక

- ధర్మ దర్శనానికి 4గంటలకు పైగా సమయం
- వివిధ పూజలతో ఒక్క రోజే రూ.1.02కోట్ల ఆదాయం



క్యూకాంప్లెక్స్‌లో నిండిపోయిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రిలో ఆదివారం భక్త జన జాతర కొనసాగింది. దీంతో స్వామివారి ధర్మ దర్శనానికి 4గంటలకు పైగా సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి 2గంటలు, బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. ఆదివారం ఒక్క రోజే 32వేల మంది ఉచిత బస్సుల్లో ప్రయాణం చేసినట్లు అధికారులు వెల్లడించారు. వివిధ పూజలతో స్వామివారికి ఒక్క రోజులోనే రికార్డుస్థాయిలో నిత్య ఆదాయం రూ.1,02,68,099 వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా బ్రేక్ దర్శనం టిక్కెట్లను తగ్గించి.. ఉచిత దర్శనం భక్తులకు ప్రాధాన్యత కల్పించామని ఈఓ భాస్కర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

81వేలకు మందికి పైగా..

యాదాద్రీశుడిని ఆదివారం 81వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్టాండ్లు, క్యూలైన్లు, మాడ వీధులు, లక్ష్మీ పుష్కరిణి, సత్య నారాయణస్వామి వ్రత మండపం, కల్యాణ కట్ట ప్రాంతాలు కిటకిటలాడాయి.

బ్రేక్ దర్శనానికి పోటీపడిన భక్తులు..

బ్రేక్ దర్శనంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఉదయం సమయంలో రూ.1500 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. దీంతో ఉత్తర రాజగోపురం నుంచి గర్భాలయంలో వెళ్లేందుకు భక్తులకు 30నిమిషాల సమయం పట్టింది. సాయంత్రం సైతం అదే తరహాలో భక్తులు బ్రేక్ దర్శనానికి వచ్చారు. ఇక రూ.150 టికెట్‌పై భక్తులు అధికంగా దర్శనానికి వెళ్లారు. భక్తులు అధికంగా రావడంతో ఉదయం కొండ పైకి రూ.500 టికెట్ కొనుగోలు చేసే వాహనాలను అనుమతించలేదు. ఉదయం 11గంటల వరకే కొండపైన ఉన్న పార్కింగ్, మొదటి ఘాట్‌రోడ్డు, బస్టాండ్ వంటి ప్రాంతాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దీంతో రింగ్ రోడ్డులో ఉన్న వాహనాలను సెంట్రల్ పార్కింగ్‌లోకి పంపించారు. పలువురు భక్తులు వైకుంఠ ద్వారం చెంత రింగ్ రోడ్డులో వాహనాలను నిలిపి మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు.



బస్సుల కోసం బస్టాండ్‌లో బారులుదీరిన భక్తులు



దర్శనానికి వెళ్తున్న భక్తులు

భక్తుల అవస్థలు..

ఆలయ పరిసరాల్లో, బస్సులు ఎక్కే సమయంలో, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఉక్కపోతతో గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. బస్సుల కోసం భక్తులు పోటీ పడ్డారు. సీట్ల కోసం ఘర్షణకు దిగారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ..

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, పాడి పరిశ్రమలు, ఫిషరీష్ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్ సిన్హా తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్ల తర్వాత లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం, ఈఈ డాక్టర్ శ్రావణ్ కుమార్, జిల్లా ఫిషరీష్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజారాం, డాక్టర్ శివరామకృష్ణ, శ్రీనివాస్, విజయ డెయిరీ మేనేజర్ మహేష్, రాజు, సురేష్, వెంకటేష్, సతీష్, కుమార్, నర్సింహ ఉన్నారు.



యాదాద్రి ఆలయంలో స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అధర్ సిన్హా

ఆడబిడ్డకు జన్మనిచ్చి బాలింత మృతి

• తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులు



మహేశ్వరి (ఫైల్)



ఏడుస్తున్న మహేశ్వరి పిల్లలు

అర్వపల్లి: పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిన మరుసటిరోజే బాలింత మృతిచెందింది. దీంతో ఇద్దరు చిన్నారులు తల్లి ప్రేమకు దూరమయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన సూరారపు నరేష్‌కు నాగారం మండల కేంద్రానికి చెందిన మహేశ్వరికి మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 18 నెలల వయస్సు గల కుమార్తె కిన్సిక ఉంది. మరోసారి గర్భం దాల్చిన మహేశ్వరి పురిటి నొప్పులతో బాధపడుతూ గురువారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లింది. శుక్రవారం డాక్టర్లు మహేశ్వరికి ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ పుట్టిన కొద్దిసేపటికే మహేశ్వరి లోబీపీతో కోమాలోకి వెళ్లింది. దీంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచన మేరకు శనివారం సాయంత్రం ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా ఐసీయూకు తరలించిన డాక్టర్లు కొద్దిసేపటి తర్వాత మహేశ్వరి మృతిచెందినట్లు చెప్పారు. శనివారం రాత్రి మహేశ్వరి మృతదేహాన్ని కొమ్మాల గ్రామానికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లు చేసిన వైద్యం వికటించడం వలనే తన భార్య చనిపోయిందని మృతురాలి భర్త నరేష్ ఆరోపించాడు. దీనిపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

డీఎంహెచ్ఓ వివరణ..

ఈ ఘటనకు సంబంధించి సూర్యాపేట జిల్లా డీఎంహెచ్ఓ కోటాచలంను వివరణ కోరగా.. మహేశ్వరి ఊరిరితిత్తులు, రక్తనాళాల్లోకి ఉమ్మనీరు చేరిందని, లక్ష మంది గర్భిణుల్లో ఒకరికి ఇలా జరుగుతుందని పేర్కొన్నారు. ఆమెను బతికించేందుకు ఎంతో ప్రయత్నించినప్పటికీ, పరిస్థితి విషమించడంతోనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి పంపిచామని సూర్యాపే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు తనకు తెలియజేశారని డీఎంహెచ్ఓ తెలిపారు. డాక్టర్లు చేసిన వైద్యంలో ఎటువంటి లోపం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

• మహిళకు గాయాలు



గాయపడిన కటికర్ల నారమ్మ

డిండి: రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి పట్టణంలో జరిగింది. వివరాలు.. డిండి పట్టణ కేంద్రానికి చెందిన కొప్పునూరి పర్వతాలు తనకున్న పాత ఇంటిని నెల రోజుల క్రితం కూల్చివేసి నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో పర్వతాలు గ్రామ పంచాయతీ రికార్డులో తమ పేరు మీద ఉన్నదాని కన్నా ఎక్కువ గ్రామకంఠం భూమి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడంతో వీధి రోడ్డు తక్కువ అవుతుందని కటికర్ల సుధాకర్, నారమ్మ కుటుంబ సభ్యులు పర్వతాలును నిలదీశారు. ఈ క్రమంలో ఆదివారం ఇరు కుటుంబాల మధ్య మాటామట పెరిగి ఒకరిపై ఒకరు కంకర రాళ్లు విసురుకున్నారు. ఈ దాడిలో కటికర్ల నారమ్మ తలకు తీవ్రగాయం కావడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై డిండి గ్రామ పంచాయతీ కార్యదర్శి జంగయ్యను వివరణ కోరగా.. పర్వతాలు నిర్మాణం చేపడుతున్న ఇంటికి ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని, గ్రామకంఠం భూమి ఆక్రమించినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

పశువులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎంను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనుగోలు చేసిన 76 ఎద్దులు, 2ఆవులను డీసీఎంలో ఎక్కించి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులో పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు, పశువులను గోశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టభద్రులూ.. ఓటేయండి ఇలా..

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటర్లు ఓటు ఎలా వేయాలనే పూర్తి వివరాలను నల్లగొండ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం వారు ఇచ్చిన వాయిలెట్ కలర్ స్కెచ్ పెన్‌తో మాత్రమే బ్యాలెట్ పేపర్‌లో తమకు నచ్చిన అభ్యర్థి ఎదుట 1, 2, 3, 4 ప్రాధాన్యతా క్రమంలో రాయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్‌పై ఇద్దరు అభ్యర్థులకు ఒకేసారి మొదటి ప్రాధాన్యత ఓటు 1 అని రాయకూడదన్నారు. బ్యాలెట్ పేపర్‌పై సంతకం చేయడం, పేరు, అక్షరాలు వంటివి రాయకూడదని పేర్కొన్నారు. అంకెలు కాకుండా మరే ఇతర గుర్తులు రాయకూడదని సూచించారు. ఒకే అభ్యర్థికి రెండు ప్రాధాన్యతలు ఇవ్వకూడదని వివరించారు.

మట్టపల్లిలో నృసింహుడికి పుష్పయాగం



పవళింపుసేవ నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ఆలయంలోని అద్దాల మండపంలో శ్రీరంగ నాయకస్వామి అలంకారంలో(శృంగార డోలోత్సవం) పవళింపు సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, యాజ్ఞీకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి బలవన్మరణం



సామేలు (ఫైల్)

త్రిపురారం: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేటలో జరిగింది. ఎస్‌ఐ వీరేశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన గన్నెపోగు సామేలు(27) పెద్దదేవులపల్లిలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 23వ తేదీన కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో గల ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొమ్మలరామారంలో విషాదం

• మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



నాగిరెడ్డి రాంరెడ్డి (ఫైల్)



ధనంజయ్ మృతదేహం

బొమ్మలరామారం: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మలరామారం మండలవాసులు ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి రాంరెడ్డి, అదే మండలం ధర్మారెడ్డిగూడెంలో నివాసముంటున్న ధనంజయ్ కలసి ఆదివారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని తిమ్మాయిపల్లికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో కీసర సమీపంలోకి వెళ్లగానే ఈదురు గాలులకు చెట్టు విరిగి వీరిపై పడింది. దీంతో నాగిరెడ్డి రాంరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన ధనంజయ్‌ను ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏపీకి చెందిన ధనంజయ్ ధర్మారెడ్డి గూడెంలో నివాసముంటూ ట్రాక్టర్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు.

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



మిర్యాలగూడ టౌన్: వాల్యతండాలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వాల్యతండాలో 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాల్యతండాకు చెందిన ధనావత్ మాళి రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కు ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసినట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి 15 క్వింటాళ్ల(30బస్తాలు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయ్ ఆర్ఐ ఠాగూర్ సురేందర్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండమల్లేపల్లిలో 6.5 క్వింటాళ్లు..


కొండమల్లేపల్లి : మండలంలోని ఆంబోతు తండాకు చెందిన ఆంబోతు సుమన్ ఇంట్లో నిల్వ ఉంచిన 6.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

• మరొకరికి తీవ్రగాయాలు

దేవరకొండ: బైక్ బొలేరోను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం దేవరకొండ మండలం కర్నాటిపల్లి వద్ద జరిగింది. సీఐ నర్సింహులు తెలిపిన ప్రకారం.. దేవరకొండ మండలంలోని పద్మట్‌పల్లికి చెందిన పల్లె అరుణ్, పల్లె మధు(22) బైక్‌పై పద్మట్‌పల్లి నుంచి దేవరకొండకు వస్తున్నారు. మార్గమధ్యలో కర్నాటిపల్లి గ్రామ స్టేజీ వద్ద బొలెరో వాహనం అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చింది. దీంతో అరుణ్, మధు బొలెరో వాహనాన్ని ఢీకొట్టారు. ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. మధుని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు



సైదులు

నల్లగొండ క్రైం: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ చెరువు(ఉదయ సముద్రం)లో ఆదివారం చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాలు.. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన కొడదల సైదులు, జెర్రిపోతుల మహేష్, పెరిక రాము కలిసి ఆదివారం సాయంత్రం చేపలు పట్టడానికి పానగల్ చెరువుకు వెళ్లారు. సాయంత్రం వీచిన ఈదురుగాలులకు తెప్ప తిరగబడి సైదులు గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరు చెరువు కట్ట సమీపంలో ఉండటంతో గాలి వేగానికి ఒడ్డుకు వచ్చి పడటంతో వారి ప్రాణాలు దక్కాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గల్లంతైన సైదులు ఆచూకీ కోసం గాలించేందుకు ప్రయత్నించగా.. వెలుతురు సరిగ్గా లేకపోవడంతో వెనక్కు తగ్గారు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టి సైదులును బయటకు తీయనున్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య

- పెట్రోల్ పోసి నిప్పటించి ఘాతుకం
- పోలీసులు అదుపులో నిందితులు



వెంకటేష్ (ఫైల్)

సూర్యాపేట: పాత కక్షలను మనసులో పెట్టుకుని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవపురంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రామచంద్రపల్లె గ్రామానికి నందికొండ వెంకన్న అలియాస్ వెంకటేష్(25) మూడేళ్ల క్రితం ఒక అమ్మాయిని ప్రేమించాడు. అదే అమ్మాయిని వెంకటేష్ స్నేహితుడైన కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ ఆవాసం రసూల్‌గూడేనికి చెందిన బెజవాడ రాజశేఖర్ కూడా ప్రేమించాడు. ఇది మనసులో పెట్టుకున్న వెంకటేష్ ఎలాగైనా రాజశేఖర్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. రెండేళ్ల క్రితం మద్యం తాగుదామని చెప్పి రాజశేఖర్‌ను వెంకటేష్ రసూల్‌గూడెం గ్రామ శివారులో ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లాడు. రాజశేఖర్‌కు మద్యం తాపించి అతి కిరాతకంగా హతమార్చి భూమిలో పూడ్చి పెట్టాడు. ఈ కేసులో వెంకటేష్ జైలుకు కూడా వెళ్లి సంవత్సరం క్రితమే బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత గ్రామంలో గొడవలు అవుతాయని భావించిన వెంకటేష్ ఆరు నెలల క్రితం సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామంలో ఉంటున్న తన చిన్నమ్మ ఇంట్లో నివాసం ఉంటూ సూర్యాపేట పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా రాజశేఖర్‌ను హత్య చేసిన ఘటనను మనసులో పెట్టుకున్న అతడి కుటుంబ సభ్యులు పథకం ప్రకారం ఈ నెల 23వ తేదీ ఉదయం వెంకటేష్‌కు ఫోన్‌చేసి ఫైనాన్స్‌కు డబ్బులు కావాలని సూర్యాపేట మండలం రాయినిగూడెం పరిధిలోని రాజుగారి తోట హోటల్ వద్దకు పిలిపించి అతడిని కిడ్నాప్ చేశారు. వెంకటేష్ కిడ్నాప్ అయ్యాడని అతడి కుటుంబ సభ్యులు ఈ నెల 24న సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మోతె మండలంలో వెంకటేష్ మృతదేహం..

కిడ్నాప్ కేసు దర్యాప్తును రూరల్ పోలీసులు వేగవంతం చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వెంకటేష్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా మోతె మండలం రాఘవపురంలో గ్రామ శివారులో అతడు ఉన్నట్లు పోలీసులు గుర్తించి అక్కడకు వెళ్లి చూడగా.. వెంకటేష్‌ను హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు గుర్తించారు. వెంకటేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ దొరికిన ఆధారాల ప్రకారం చనిపోయింది వెంకటేషే అని గుర్తించారు. ఈ హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.